క్లుప్తంగా

పీ-4 సర్వేలో పాల్గొనాలి



కొత్తకోటలో పీ-4 సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో జరుగుతున్న పీ - 4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, ప్టానర్‌షిప్) సర్వేలో ప్రజలందరూ పాల్గొనాలని కర్నూలు సీపీఓ కార్యాలయ గణాంక అధికారి రంగనాయకులు కోరారు. స్థానిక గ్రామ సచివాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శి సైపుల్లాబేగ్ గ్రామ సభను నిర్వహించారు. మండల గణాంక అధికారి ఆదినారాయణతో కలిసి పాల్గొన్న రంగనాయకులు ప్రజలకు సర్వేపై అవగాహన కల్పించారు. సున్నా పేదరిక నమోదు కార్యక్రమంలో భాగంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ సర్వే చేపట్టినట్లు తెలియజేశారు. వీఆర్వో శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి



ట్యాంకు శుభ్రత పనులను పరిశీలిస్తున్న ఏఈ గోనేనాయక్

సి.బెళగల్: మండల ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు కృషి చేయాలని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని పార్కు దగ్గరున్న భూ ఉపరితల మంచినీటి ట్యాంకును సర్పంచ్ పాండురంగన్న శుభ్రం చేయించారు. పనులను ఏఈ పరిశీలించి కూలీలకు, సర్పంచ్‌కు సూచనలు చేశారు. అన్ని గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కనీసం 15 రోజులకు ఒకసారి ట్యాంక్‌లను శుభ్రం చేయించాలని, నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాత ప్రజలకు సరఫరా చేయాలని కార్యదర్శులకు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.

చలివేంద్రాలు ప్రారంభం



కోడుమూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: కోడుమూరులో ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం చలువపందిరి, చలివేంద్రాలను సోమవారం గ్రామ సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీఓ రాముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు మాట్లాడుతూ.. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని కోడుమూరులోని పాత బస్టాండ్‌లో చలువ పందిరితో పాటు, రెండు చలివేంద్రాలను, అంబేడ్కర్ సర్కిల్‌లో ఒక చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈఓ అజయ్‌భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫార్మసీ విద్యార్థులు

పాణ్యం: శరీరంలో వ్యాధి నిరోధక శక్తితో అనేక వ్యాధులను జయించవచ్చని, శాంతిరామ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌శెట్టి అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతిరామ్ ఆసుపత్రిలో క్షయవ్యాధి గ్రస్తులకు వ్యాధి నిరోధక శక్తిపై అవగాహన కల్పించారు. టీబీ వ్యాధి నుంచి ఎలా బయటపడాలి, శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని ఎలా పెంచుకోవాలనే అంశంపై చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ ఎల్ల సుబ్బయ్య పాల్గొన్నారు.

మాతృభాషతోనే సంస్కృతి పునరుజ్జీవం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై అధ్యాపకు లు ఆందోళన చెందుతున్నారు. ద్వితీయ భాషగా ఉన్న తెలుగు సబ్జెక్టును ఐచ్ఛిక సబ్జెక్టుగా చేసిన మార్పులను వెంటనే నిలిపి వేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకులు సోమవారం ఇంటర్ స్పాట్ క్యాంపు నుంచి రాజ్‌విహార్ మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ వరకు వచ్చి నిరసన తెలిపారు. తెలుగు అధ్యాపకులు మాట్లాడుతూ.. మాతృభాషతోనే విద్యార్థి సమగ్ర వికాసానికి బాటలు వేసేందుకు సాధ్యమని అన్నారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాల వలన తెలుగు బాష మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఇంగ్లిష్ సబ్జెక్టును కచ్చితం చేసి, తెలుగును ఐచ్ఛికం చేయడమంటే తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్పవల్లి..

మూల పెద్దమ్మ తల్లి!

- ఈనెల 31 నుంచి వచ్చే నెల 1 వరకు పెద్దమ్మ జాతర
- భక్తులకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



భక్తులకు దర్శనమిస్తున్న మూల పెద్దమ్మ అమ్మవారు



మూలపెద్దమ్మ జాతరకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలో కొలువైన మూల పెద్దమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వెలుగొందుతోంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ రోజురోజుకూ భక్తులను పెంచుకుంటోంది. కొలిచే వారికి కొంగుబంగారంగా నిలుస్తున్న మూల పెద్దమ్మ భక్తుల నుంచి పూజలుందుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ఉన్నతాధికారులు ఉత్సవ కమిటీని సైతం ఏర్పాటు చేశారు.

31 నుంచి జాతర ప్రారంభం

ఉగాది పండుగ మరుసటి రోజు(ఈ నెల 31) నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రామలింగారెడ్డి తెలిపారు. 31న సోమవారం ఉదయం దేవస్థానం వారిచే అమ్మవారికి ఆకుపూజ, కుంకుమార్చన పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారి ఘటానికి వెళ్లి, అనంతరం వాల్మీకులు బోనాలు తీసుకెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏప్రిల్ 1న మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకు పూజ, కుంకుమార్చన పూజలు చేసుకునేందుకు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా అన్నదానం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర సందర్భంగా భక్తుల కాలక్షేపానికి 31న రాత్రి సినీ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేస్తున్నారు. 1న సాయంత్రం బైక్‌స్లో పందెం, గుండు ఎత్తడం, తాడు లాగే పోటీలు ఉంటాయి.

జాతరకు ప్రత్యేక బందోబస్తు

మూలపెద్దమ్మ జాతరకు ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకార్యార్థం నాలుగు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా దారి మళ్లించనున్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం



మూల పెద్దమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నాం. జాతర అనంతరం నెల రోజుల పాటు ప్రతి మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వస్తుంటారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే అన్నిశాఖల అధికారుల సహకారంతో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. జాతరకు వచ్చే భక్తులకు నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకుని అమ్మవారిని దర్శించుకోవాలి.

– రామలింగారెడ్డి, ఈఓ, మూలపెద్దమ్మ ఆలయం

సర్వేల భారం తగ్గించాలి

సి.బెళగల్: గ్రామ పంచాయతీల కార్యదర్శులపై పని భారంను తగ్గించాలని ఎంపీడీఓ రాణెమ్మను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం చేరుకుని ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల్లో చేపడుతున్న వివిధ రకాల సర్వేల వల్ల సెలవు, పండుగ దినాలు, వినియోగించుకోవడానికి ఏమాత్రం అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేల పేరుతో తమపై ఒత్తిడి తెస్తుండటంతో కుటుంబ సభ్యులతో గడపలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో ఆరోగ్య సమస్యలతో పాటు మానసిక సమస్యలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పనిఒత్తిడిని తగ్గించి తమకు ఉపశమనం కలిగించాలని ఎంపీడీఓను, ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వెల్లడించారు. అర్జీ ఇచ్చిన వారిలో పంచాయతీ కార్యదర్శులు ముస్తాక్, సునీల్‌రాణి, రాజేష్, వెంకటేష్, జగదీష్, సుధాకర్, కృష్ణప్రసాద్‌నాయుడు, సుంకన్న తదితరులు ఉన్నారు.

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

పాణ్యం: ప్రతి ఆదివారం పాణ్యంలో నిర్వహించే సంతలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, కేజే శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డిని కలిసి విన్నవించారు. మండల కేంద్రం చుట్టుపక్కల గ్రామాల నుంచి సంతకు వందల సంఖ్యలో ప్రజలు, వినియోగదారులు వస్తుంటారని, వారికి కనీసం తాగేందుకు నీరు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఇంటి నిర్మాణానికి సహకరించాలి

సి.బెళగల్: తమ ఇంటి స్థలానికి పొజీషన్ సర్టిఫికెట్ జారీ చేసి ఇంటి నిర్మాణానికి సహకరించాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తంకు అర్జీలను ఇచ్చారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలాధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా సి.బెళగల్‌తో పాటు పోలకల్, కంబదహాల్, ముడుమాల, కొత్తకోట గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులకు అర్జీలు ఇచ్చారు. అదేవిధంగా తమ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి భూ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సమస్యలపై విచారించి పరిష్కారం చూపుతామని ఆయన అర్జీదారులతో అన్నారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి, ఎంపీఈఓ వెంకటేష్ తదితరులు ఉన్నారు.



పీజీఆర్ఎస్‌లో అధికారులకు అర్జీ ఇస్తున్న ప్రజలు

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

పాణ్యం: ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను పరిష్కరించడంలో . అధికారులు నిర్లక్ష్యం వహించరాదని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాయలంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ఓర్వకల్లు: దళిత విద్యార్థులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు నారాయణ, రామకృష్ణ, రాముడు డిమాండ్ చేశారు. కోడుమూరు ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు

కోడుమూరు రూరల్: పోక్సో కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసినట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి భూపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం కోడుమూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పొదుపు, అంగన్‌వాడీ మహిళలు, మహిళా పోలీసులకు పోక్సో యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం–2012 ప్రకారం పిల్లలపై లైగింక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవన్నారు. 18 సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడకుండా పోక్సో యాక్ట్ ఉపయోగపడుతుందన్నారు. ట్రైనీ జ్యుడిషియల్ ఆఫీసర్లు ఈశ్వర వెంకట ప్రసాద్, లీలాసాయి సుభాష్, హేమ, అర్చన, శ్రీవల్లి, సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీఓ రాముడు, డీటీ రామాంజనేయులు, సీడీపీఓ శారద, ఏపీఎంలు సుబ్బయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొదటి అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి

ఫిజియోథెరపీతో కండరాలలో కదలిక



సి.బెళగల్‌లో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు వీరేష్

సి.బెళగల్: దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేయించడం ద్వారా కండరాలలో చలనం వస్తుందని, తద్వారా కండరాలకు బలం చేకూరుతుందని ఫిజియోథెరపిస్ట్ వీరేష్ అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో పది మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. క్యాంప్ నిర్వహణ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు ముడుచుకుపోయిన కాళ్లకు, చేతులకు బాల్, పాడ్స్ తదితర పరికరాలపై ప్రతి సోమవారం వ్యాయామం చేయిస్తున్నట్లు చెప్పారు. క్యాంప్‌లో తాము చేయించిన వ్యాయామ పద్ధతిని దివ్యాంగులకు ఇంటి వద్ద కూడా చేయించాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ప్రతి వారం ఉచితంగా నిర్వహించే ఫిజియోథెరపి క్యాంప్‌ను మండల ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఐఈఆర్‌టీ మద్దిలేటి ప్రత్యేక పరికరాలతో విద్యను బోధించారు. దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

29న సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు జిల్లా ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగుల సహకార గృహ నిర్మాణ సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 29న జరుగుతుందని అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్మన్ టి.నాగరమణయ్య తెలిపారు. ఏపీ సహకార సంఘాల చట్టం ప్రకారం మార్చిలోపు ఈ సమావేశం జరుగాల్సి ఉన్నందున 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశం సి.క్యాంపు సెంటర్‌లోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం భవనంలో ఉదయం 11 గంటలకు జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖకు సంబంధించి పలు అభివృద్ధి పనులు జరుగుతున్నందున ఈ నెల 25న వివిధ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. బి.రోడ్ సెక్షన్ పరిధిలోని చల్లావారి వీధి, మహావీర్‌నగర్, ఆర్టీసీ బస్టాండు, శ్రీనివాస కాంప్లెక్స్, త్రిగుణ హోటల్, ఓల్డ్ కల్లూరు రోడ్, తిలక్ నగర్‌లలో ఉదయం 8 గంటల నుంచి, సంతోష్‌నగర్ సెక్షన్ పరిధిలో వెంకటరమణ కాలనీ, రామలింగేశ్వరనగర్, అమీన్ అబ్బాస్‌నగర్, లక్ష్మణ్‌సింగ్ కాలనీలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని తెలిపారు.

అమర వీరులకు నివాళి



అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(రూరల్): ప్రతి పాఠశాలలో కంప్యూటర్ శిక్షణ కేంద్రం, యోగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం జి.సింగవరం గ్రామంలో అమరవీరులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్ రాజగురు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘువేంద్ర మాట్లాడుతూ.. అమరవీరుల ఆశయ సాధన కోసం పనిచేయడమే వారికిచ్చే నిజమైన నివాళి అన్నారు. గతంలో ప్రతి పాఠశాలలో కంప్యూటర్ టీచర్, యోగా శిక్షకుడు ఉండేవారని, వారిని మళ్లీ నియమించాలని కోరారు. డీవైఎఫ్ఐ నాయకులు విశ్వానాథ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టండి

సి.బెళగల్: మండల కేంద్రంలోని నూతన కాలనీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆ కాలనీలకు చెందిన మహిళలు ఎంపీడీఓ రాణెమ్మకు వినతి పత్రం ఇచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న నూతన కాలనీలకు చెందిన పలువురు మహిళలు తమ కాలనీలలో అంతర్గత రోడ్లు, మురుగు కాలువలు, మంచినీటి సరఫరా వంటి అభివృద్ధి పనులను చేపట్టడం లేదని, ఆయా పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా శ్రీరాఘవ కాలనీకి మంచి నీటిని సరఫరా చెయాలని ఆ కాలనీవాసులు కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, వెంకటప్రకాష్, సుమంత్, ఉపాధిహామీ ఏపీఎం రామన్న తదితరులు ఉన్నారు.



ఎంపీడీఓ రాణెమ్మకు అర్జీ ఇస్తున్న మహిళలు

విద్యా నైపుణ్యాలను పెంపొందించాలి

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. ఆమె సోమవారం మండల పరిధిలోని బురాన్‌దొడ్డి, బ్యాతోలి గ్రామాల్లో పర్యటించి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ పాఠశాల పరిసరాలను, తరగతి, వంట గదులను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల రికార్డులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించిన ఎంఈఓ విద్యార్థుల గైర్హాజరుపై టీచర్లను వివరణ కోరారు. అలాగే విద్యార్థులచే పాఠ్యాంశాలు చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం పాఠ్యాంశాల బోధన, పాఠశాల నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అదేవిధంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి, మెనూ, శుచి, శుభ్రతపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆయా పాఠశాలల టీచర్లు ఉన్నారు.



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ జ్యోతి

హామీలను అమలు చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంపై సత్యదూర ఆరోపణలు చేసి, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో ఘోరంగా విఫలమైందన్నారు. రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు, తల్లికి వందనం తదితర పథకాలలో ఏ ఒక్కటీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఉపాధి పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితర సమస్యలపై తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు మధుసూదన్, మాసూం బాషా, సలాం బాషా, దానమయ్య, సిద్ధయ్య, ఆకుల మధు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కర్నూలు: ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర ఉపాధ్యక్షుడు మణిబాబు నాలుగు రోజుల క్రితం గుండె సంబంధిత వ్యాధితో ప్రభుత్వాసుపత్రిలో చేరారు. వైద్యులు ఆయనకు పరీక్షలు చేసి స్టంట్ వేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు ఈ విషయం తెలుసుకుని మణిబాబు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాబుకు, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పి ఫెడరేషన్ తరఫున కొంత ఆర్థిక సాయం అందించారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు మద్దిలేటి, కేబీ శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

30 నుంచి నవరాత్రి పూజలు

కర్నూలు కల్చరల్: కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు మహా గౌరీ అమ్మవారికి శ్రీదేవి వసంత నవరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ సభ్యులు తెలిపారు. వసంత రుతువు ప్రారంభ నేపథ్యంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు అమ్మవారికి అర్చనలు, ఉపాసనలు, సహస్రనామాచర్చన, నవ చండీ సప్తశతి పారాయణం, చివరి రోజు చండీ హోమం జరుగుతుందని పేర్కొన్నారు.

జాతీయ పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాదుస్తులు పంపిణీ చేసిన అసోసియేషన్ నాయకులు

కర్నూలు (టౌన్): ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని జహీరాబాదులో నిర్వహించే 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు ప్రతిభ చాటాలని హ్యాండ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జాతీయ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ పోటీలను అవకాశంగా మలచుకొని సత్తా చాటాలన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



గడివేములలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని వైద్యులు కిరణ్‌కుమార్, రంజిత కుమారి సూచించారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వరల్డ్ టీబీ డే సందర్భంగా ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయవ్యాధి అంటువ్యాధి అని రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు గాలి ద్వారా ఇతరులకు వ్యాపిస్తాయన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే ప్రభుత్వాసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మహేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

- కల్లూరు: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు డాక్టర్ నవీన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారు తప్పని సరిగా ఆరు నుంచి ఎనిమిది నెలలు మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగరాజు, మద్దమ్మ, హెల్త్ ఎడ్యూకేటర్ స్వర్ణ గౌరి పాల్గొన్నారు.

గణితం పరీక్షకు 19 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి గణితం పబ్లిక్ పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. కొత్తకోట జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో ఐదుగురు, ఏపీ మోడల్ స్కూల్ కేంద్రంలో ఇద్దరు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో తొమ్మిది మంది, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ముగ్గురు చొప్పున మొత్తం 19 మంది గైర్హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు వంశీమోహన్, బలరాముడు, రఘురామిరెడ్డి, మల్లయ్య తెలిపారు. సి.బెళగల్ ఎస్ఐ తిమ్మారెడ్డి పరీక్ష కేంద్రాల వద్ద మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు. అలాగే ఆయా పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య సేవలందించేందుకు క్యాంప్‌లను నిర్వహించారు.

ఓర్వకల్లులో 8 మంది విద్యార్థులు..

ఓర్వకల్లు: మండలంలోని వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ ఓంకార్ యాదవ్ తెలిపారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 1,034 మందికి గానూ 1026 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.